8న జాతీయ ఉపకార వేతన పరీక్ష

డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

2024-25 విద్యా సంవత్సరానికి జరగనున్న జాతీయ ఉపకార వేతన పరీక్ష డిసెంబర్ ఎనిమిదో తేదీ ఆదివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థుల హాల్‌టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల యు - డైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయి తమ పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందించాలని ఆమె సూచించారు.

ఎంపీ గారూ.. ప్రజల గోడు పట్టదా..!

నేవీ ఆయుధ డిపోపై పదేపదే ప్రకటనలపై జనాగ్రహం

గ్రామసభల్లో మూడుసార్లు వ్యతిరేకించిన ఐదు గ్రామాల ప్రజలు

ప్రజల అభిప్రాయాలకు విలువ లేదా అని ఎంపీని ప్రశ్నిస్తున్న జనం

ఈ డిపో ఏర్పాటు వెనుక మీ ఆంతర్యం ఏంటంటూ విమర్శలు

ఏజెన్సీలో గిరిజనులను ఇబ్బంది పెట్టడమే ప్రజాప్రతినిధుల లక్ష్యమా?

ఆయుధ డిపోపై ముందుకెళ్తే ప్రతిఘటన తప్పదంటూ హెచ్చరికలు

ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ గ్రామసభలో చేతులెత్తిన ప్రజలు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తీరుపై ఏజెన్సీలోని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా నేవీ ఆయుధ డిపోపై పదేపదే ప్రకటనలు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. మూడు సార్లు గ్రామసభల్లో ఆయుధ డిపోకు వ్యతిరేకంగా తీర్మానాలు చేసినప్పటికీ డిపో ఏర్పాటు చేస్తామంటూ ఎంపీ చేస్తున్న ప్రకటన వెనుక అసలు ఉద్దేశం ఏమిటో చెప్పాలని ఏజెన్సీ ప్రజలు నిలదీస్తున్నారు. తాము ఓట్లు వేసి గెలిపించుకున్న ఎంపీ తమకు వ్యతిరేకంగా పని చేయడం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ పుట్టా మహేష్ వచ్చి తమతో మాట్లాడితే ఆయుధ డిపో ఏర్పాటు చేస్తే ఎటువంటి ఇబ్బందులు వస్తాయి.. తాము ఏవిధంగా నష్టపోతాం.. ఇప్పటికే ఏజెన్సీలో గిరిజనులు ఏవిధంగా నష్టపోయారు.. అనేది అన్ని వివరాలు చెబుతామని అక్కడి జనం చెబుతున్నారు. జీలుగుమిల్లి మండలంలోని వంకావారిగూడెం, దాట్లవారిగూడెం, మడకం వారిగూడెం, రమణక్కపేట, కొత్తసీమలవారిగూడెం మొత్తం ఐదు గ్రామాల పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చూస్తోంది. 2023లో వైసిపి ప్రభుత్వం డిపో ఏర్పాటుపై ముందుకు సాగేందుకు ప్రయత్నించగా ఐదు గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఏజెన్సీ చట్టాల ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో ఏ పని చేపట్టాలన్నా గ్రామసభ తీర్మానం అత్యంత ముఖ్యం. వైసిపి హయాంలో రెండు సార్లు గ్రామసభలు చేపట్టగా అక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అక్టోబర్ 28న జరిగిన గ్రామసభలో మరోసారి ముక్తకంఠంతో ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు. ఇప్పటి వరకూ మూడుసార్లు వ్యతిరేకంగా తీర్మానాలు చేసినప్పటికీ ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాత్రం జీలుగుమిల్లి మండలంలో ఆయుధ డిపో ఏర్పాటు చేస్తామని పదేపదే ప్రకటనలు చేస్తుండటం చర్చనీయాంశమైంది. దీన్ని బట్టి ఎంపీ పుట్టా మహేష్ ప్రజాభిప్రాయానికి విలువ లేదన్నట్లు మాట్లాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయుధ డిపో ఏర్పాటుకు దాదాపు 1,166 ఎకరాలు సేకరించనున్నట్లు అందుకు సంబంధించిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఐదు గ్రామాలు పూర్తిగా కనుమరుగు కానున్నాయి. అంతేకాకుండా ఆయుధ డిపో ఏర్పాటైతే ఆ ప్రభావం జీలుగుమిల్లి మండలం మొత్తంగా పడుతోంది. నేవీ అధికారుల ఆంక్షలతో అక్కడి ప్రజల జీవనం తీవ్ర ఇబ్బందికరంగా మారే పరిస్థితి ఏర్పడనుంది. అంతేకాకుండా ఆయుధ డిపో ఏర్పాటైతే కాలుష్యంతో అనారోగ్య సమస్యలతోపాటు అనేక ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

ఏజెన్సీలోనే ఎందుకు.. వేరే చోట ఎందుకు పెట్టరు..?

ఏలూరు జిల్లాలో పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మొత్తం ఐదు మండలాల్లో ఏజెన్సీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు పేరుతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను ముంపు ప్రాంతాలుగా ప్రకటించారు. పోలవరం మండలంలో 25 గ్రామాలను ఇప్పటికే ఖాళీ చేయించి తరలించారు. పోలవరం ముంపు గ్రామాల ప్రజలకు జీలుగుమిల్లి మండలంలోనే అత్యధికంగా 20 కాలనీలు వరకూ నిర్మిస్తున్న పరిస్థితి ఉంది. జల్లేరు ప్రాజెక్టు పేరుతో జీలుగుమిల్లి మండలంలోని పాత, కొత్త జిల్లెళ్లగూడెం గ్రామాలు, పాత, కొత్త బొత్తప్పగూడెం గ్రామాలు, తాటిరామన్నగూడెం, లంకాలపల్లి వంటి గ్రామాలు ముంపుబారిన పడుతున్నాయి. బుట్టాయగూడెం మండలంలోనూ ముంపు గ్రామాలు ఉన్నాయి. ఇప్పుడు జీలుగుమిల్లి మండలంలో ఆయుధ డిపో ఏర్పాటు చేస్తే అక్కడి ప్రజలు ఎక్కడకు పోవాలి. గిరిజనులను తరమి వేయడమే ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల లక్ష్యమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మైదాన ప్రాంతాల్లో అనేకచోట్ల భూములు అందుబాటులో ఉన్నప్పటికీ ఏజెన్సీలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేయాలని ఎందుకు ముందుకు సాగుతున్నారనే అనుమానాలు నెలకొన్నాయి. అభివృద్ధి పేరుతో గిరిజనులకు మనుగడ లేకుండా చేయాలనే కుట్ర దాగి ఉన్నట్లు ఏజెన్సీ ప్రజల్లో చర్చ సాగుతోంది. ఏజెన్సీలో భూముల ధరలు తక్కువగా ఉంటాయనే కారణంతోనే ఇక్కడ డిపో ఏర్పాటు చేసేందుకు పూనుకుంటున్నారనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. పోలవరం నిర్వాసితులకు పరిహారం, భూమికి భూమి, ఇళ్ల నిర్మాణం విషయంలో దశాబ్ద కాలంగా ఏజెన్సీ ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో అందరికీ కళ్ల ముందే కనిపిస్తోంది. ఇప్పుడు ఆయుధ డిపో పేరుతో గిరిజనులకు అన్యాయం చేసేందుకు ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గెలిచే వరకూ ఒకలా.. గెలిచిన తర్వాత మరోలా ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్నారంటూ అక్కడి ప్రజలు ఆవేదన చెందుతున్నారు. తమ అభిప్రాయానికి భిన్నంగా ఆయుధ డిపోపై ముందుకు సాగితే ప్రతిఘటన పెద్దఎత్తున తప్పదని ఏజెన్సీ ప్రాంత ప్రజలు హెచ్చరిస్తున్నారు

ఎట్టి పరిస్థితుల్లో ఆయుధ డిపో పెట్టనీయం..

తెల్లం సంకురుడు, రమణక్కపేట గ్రామం

మా పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఎట్టి పరిస్థితుల్లో దాన్ని ఇక్కడ పెట్టనివ్వం. మా ప్రమేయం లేకుండా పెట్టాలని చూస్తే మా ప్రాణాలైనా ఇస్తాం. ఆయుధ డిపోను మాత్రం మా ఏజెన్సీ ప్రాంతంలో పెట్టనీయబోము.

ఎంపీ వ్యాఖ్యలు బాధాకరం..

కణితి ధనలక్ష్మి, దాట్లవారిగూడెం

నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటుకు వ్యతిరేకంగా మూడుసార్లు గ్రామ సభల్లో తీర్మానం చేశాం. ఎంపీ మాత్రం త్వరలో మా గ్రామాల్లో ఆయుధ డిపో ఏర్పాటు చేస్తామని చెప్పడం బాధాకరం. ఆయుధ డిపో వస్తే గిరిజనుల బతుకులు బుగ్గిపాలవుతాయి. ఆయుధ డిపో నిర్మించుకోవాలనుకుంటే మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలి.

ఏజెన్సీని అభివృద్ధి చేయండి..

తెల్లం అబ్బులు, వంకావారిగూడెం

నేవీ ఆయుధ డిపో ఏజెన్సీ ప్రాంతంలో పెడతామని ఎంపీ అనడం బాధాకరం. ఏజెన్సీలోని గిరిజనుల పట్ల ఎంపీకి మక్కువ ఉంటే మా ఏజెన్సీ ప్రాంతాలను ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని కోరుతున్నాం.

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

కాలుష్యరహిత నగరంగా ఏలూరును తీర్చిదిద్దాలి

కలెక్టర్ కె.వెట్రి సెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

వాయుకాలుష్యాన్ని నియంత్రించేందుకు ఎలక్ట్రిక్, సిఎన్‌జి వాహనాల వినియోగంపై ప్రజలకు అవగాహన కలిగించి, వాటి వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వాయు కాలుష్యం నియంత్రణ అమలుపై ఏర్పాటైన జిల్లాస్థాయి కమిటీ సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశం హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నానాటికీ పెరుగుతూ ప్రజారోగ్యానికి చేటు చేస్తున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణా మండలి దేశంలోని వాయు కాలుష్యం కలిగిన నగరాల్లో కాలుష్య నియంత్రణకు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాలుష్యాలు ప్రజారోగ్యానికి ఏ విధంగా చేటు చేస్తాయన్న విషయం, కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ వాహనాలు, సిఎన్‌జి వాహనాల వినియోగంపై ప్రజలకు అవగాహన పెంచి, ఎలక్ట్రిక్, సిఎన్‌జి వాహనాల వినియోగం పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నగరంలోని రోడ్ల మార్జిన్లలో ఎండ్ టూ ఎండ్ వరకూ రోడ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నగరపాలక సంస్థ కమిషనర్‌ని ఆదేశించారు. పెట్రోల్, డీజిల్‌లో కల్తీ కారణంగా కూడా వాయు కాలుష్యం పెరిగే అవకాశం ఉందని, కల్తీ జరగకుండా పౌర సరఫరాల అధికారులు గట్టి నిఘా పెట్టాలన్నారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనాలు ఆగిన సమయంలో వాహనాల ఇంజిన్లు ఆపకుండా ఆన్‌లో ఉంచడం, కొంతమంది వాహనాలకు సైలెన్సర్లు లేకుండా నడపడం వల్ల వాయు కాలుష్యానికి కారణాలు అవుతాయన్నారు. వీటిని నియంత్రించేందుకు సమీకృత ట్రాఫిక్ పర్యవేక్షణ విధానం ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు, కన్సల్టెంట్ ఎ.కోమలి, సామాజిక వన విభాగం జిల్లా అటవీ శాఖాధికారి సిహెచ్.సూర్యనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

8,273 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - చాట్రాయి

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి మండలంలోని పోలవరం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. అనంతరం మంత్రి రైతులతో మాట్లాడారు. ధాన్యం అమ్ముకున్న రైతులకు ప్రభుత్వం చెప్పిన సమయానికి వారి ఎకౌంట్లకు డబ్బులు జమ అవుతున్నాయా లేదా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శివశంకర్‌ను వివరాలు అడగ్గా మండలంలో 11,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారని, ఇప్పటి వరకూ 7,300 ఎకరాల్లో వరి కోతలు అయ్యాయని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటికి 8,273 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. రైతుల ఖాతాలకు 14 కోట్ల రూపాయలు జమైందని మంత్రి పార్థసారథి వివరాలన్నీ తెలియజేయడం జరిగిందని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి ధాన్యంతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల మాజీ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, తెలుగు రైతు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి.శ్రీనివాసరావు, నేతలు బొట్టు లక్ష్మణరావు, కలకొండ భాస్కరరావు, రైతులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవి ఒంటెద్దు పోకడ నిర్ణయాలు

ఆయుధ పరిశ్రమ ఏర్పాటు ప్రయత్నాలపై అఖిలపక్ష నేతలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒంటెద్దు పోకడ నిర్ణయాలతో మండలంలోని వంకావారిగూడెం ఏజెన్సీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న నేవీ ఆయుధ పరిశ్రమను వ్యతిరేకిస్తూ బుధవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి హాజరై మాట్లాడారు. నేవీ ఆయుధ పరిశ్రమ ఏర్పాటుపై గత ప్రభుత్వం హయాంలో రెండుసార్లు గ్రామ సభలు ఏర్పాటు చేస్తే పంచాయతీలోని గ్రామస్తులంతా ముక్త కంఠంతో వ్యతిరేకించారని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక ఎంఎల్‌ఎ, ట్రైకర్ ఛైర్మన్ల ఆధ్వర్యంలో మరోమారు గ్రామసభను ఏర్పాటు చేశారని, ఈ గ్రామ సభను కూడా వ్యతిరేకించి గ్రామంలో ఆయుధ కర్మాగారం అంటూ రావొద్దని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారని గుర్తు చేశారు. మళ్లీ ఇటీవల ఏలూరు ఎంపీ ఆయుధ కర్మాగారాన్ని పెట్టేందుకు గ్రామ సభ పెట్టాలని చూస్తున్నారని, ఇది ఏజెన్సీ ప్రాంతం నుంచి గిరిజనులను తరిమి కొట్టే కుట్రగా ఉందని తెలిపారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం, పోలవరం ప్రాజెక్టు, జల్లేరు జలాశయంపేరుతో కొన్ని వందల గిరిజన కుటుంబాలను రోడ్డున పడేశారని తెలిపారు. మళ్లీ ఏజెన్సీ ప్రాంతంలోనే నేవీ ఆయుధ పరిశ్రమ అంటూ అనడం గిరిజనులను తరిమికొట్టే కుట్రలో భాగమని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు గిరిజనుల బాధను అర్థం చేసుకొని, నేవీ ఆయుధ పరిశ్రమ ఏర్పాటుపై అంత మక్కువ ఉంటే ఏజెన్సీ ప్రాంతం నుంచి వేరే చోటకు తీసుకుపోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు సరియం రామ్మోహన్, రాష్ట్ర ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, ధర్ముల రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు, కారం భాస్కర్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి.రమణ, పివైఎల్ డివిజన్ సహాయ కార్యదర్శి టి.బాబూరావు, కట్టం నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి మొడియం నాగమణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

అధికారులకు జెసి ధాత్రిరెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని వడాలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జెసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ రాగల రెండు రోజులలో వర్ష సూచన ఉన్నందున రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే సేకరించిన ధాన్యాన్ని ఆరబెట్టుకుని రైతు సేవ కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద గోనె సంచుల నిల్వలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీలక్ష్మి, మండవల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి, తహశీల్దార్ షేక్ సుభాని, మండల వ్యవసాయ అధికారి బి.వేణుమాధవ్ పాల్గొన్నారు.

ఏలూరును బాల్య వివాహాల రహిత జిల్లాగా మార్చాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా స్థాయి నుంచి మండల, గ్రామ స్థాయి వరకు ప్రతి స్థాయిలోను కిషోరి వికాసం-2.0 స్థాయిలో శిక్షకుల శిక్షణా కార్యక్రమం ద్వారా అవగాహన పెంచుకుని పకడ్బందీగా చట్టాలను అమలు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి వెల్లడించారు. కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిషోరి వికాసం-2.0 జిల్లాస్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమం జిల్లా ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం బాల్యవివాహాల వ్యతిరేకంగా జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులు, శిక్షణా కార్యక్రమానికి హాజరైన శిక్షణ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. తదుపరి కిషోరి వికాసం-2.0 కిషోరి బాలికా స్వేచ్ఛా సంపూర్ణ సాధికారిత కోసం ఏలూరు జిల్లాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ అధికారులు కిషోరి వికాసం శిక్షకుల శిక్షణా కార్యక్రమం ద్వారా జిల్లాస్థాయి శిక్షణ అందించడానికి నియమించిన టీమ్ సభ్యులు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఉపయోగించుకొని పూర్తిస్థాయిలో అవగాహన కలిగి తద్వారా మండల, గ్రామస్థాయి సభ్యులకు శిక్షణ ఇచ్చి కిషోర్ వికాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు.

బలవంతంగా భూములు తీసుకున్నారు..!

చింతలపూడి ఎత్తిపోతల పథకం రైతుల ఆవేదన

ప్రజాశక్తి - చింతలపూడి

నోటీసులు ఇవ్వకుండా అవార్డు ప్రకటించి బలవంతంగా భూములు తీసుకున్నారని చింతలపూడి ఎత్తిపోతల పథకం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం కుడి కాలువ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి ఎదుట తమ గోడును వెల్లబుచ్చారు. చింతలపూడి తహశీల్దార్ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులందరూ ఏకగ్రీవంగా తమకు ఎకరానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇస్తేనే భూములు ఇస్తామని చెప్పారు. అసైన్డ్ భూములకు కూడా జిరాయితీ భూములతో సమానంగా ధర చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. జిరాయితీ భూములకు నష్టపరిహారం ప్రకటించిన తర్వాతే, అసైన్డ్ భూముల అవార్డు ప్రకటించాలని డిమాండ్ చేశారు. నూజివీడులో రిజిస్ట్రేషన్ రూ.ఐదు లక్షలు ఉండగా ఎకరానికి రూ.19 లక్షలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. తమ భూముల వద్దకు వచ్చి తమకు తెలియకుండా జెసిబితో తవ్వుతుంటే అడ్డుపడినందుకు మాపై కేసులు నమోదు చేశారని, మూడేళ్ల కోర్టు చుట్టూ తిరిగామని, తమ భూములు ఇచ్చి నష్ట పరిహారం అడిగినందుకు కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జిరాయితీ భూములకు నష్టపరిహారం ప్రకటించిన తర్వాతే, అసలు భూముల అవార్డు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులకు తెలియకుండా పనులు చేపట్టొద్దని అభ్యర్థించారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేస్తామని మరొకసారి మంత్రి, ఎంఎల్‌ఎ, కలెక్టర్‌తో కలిపి మరొక సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సోమశేఖర్, చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితుల పోరాట సమితి కార్యదర్శి చిట్లూరి అంజిబాబు, గోలి రామకృష్ణారెడ్డి, కొనకళ్ల కృష్ణమూర్తి, సాదరబోయిన వరలక్ష్మి, వనమాల రాంబాబు, వనమా కృష్ణారావు, కుప్పాల చెన్నయ్య, పైడిమల్ల రవి, సిహెచ్.శ్రీహరి రెడ్డి, తెగడ వెంకన్న సుమారు ఒక 40 మంది భూ నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ,.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. ద్వారకాతిరుమల గ్రామంలో అంబేద్కర్ పార్కులో 15 ఏళ్ల క్రితం ఆవిష్కరించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం యంత్రాంగం వెంటనే స్పందించి నిందితులను గుర్తించి వారిపైన పీడీ యాక్ట్, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు, రాజద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత అయిన బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడమంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు. ఇలాంటి పిరికిపంద చర్యలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఉద్యమ ఉధృతం కాకుండా నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ధ్వంసం చేసిన విగ్రహ స్థానంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



ఎస్‌ఐకు వినతిపత్రం అందిస్తున్న రాము

చాట్రాయి : మండల కేంద్రమైన చాట్రాయిలో బుధవారం మాలయోధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. మాల యోధుల సంక్షేమ సంఘం మండల నాయకుడు నక్క రాము మాట్లాడుతూ ద్వారకాతిరుమల ప్రాంతంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినందుకు నిరసనగా ఆందోళన నిర్వహించినట్లు చెప్పారు. మండలంలో ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలకు రక్షణ కల్పించాలని చాట్రాయి ఎస్‌ఐ డి.రామకృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాలయోధుల సంక్షేమ సంఘం నాయకులు ధారా రాజు, రాజేష్, విజయరాజు పాల్గొన్నారు.

ఉద్దరాజు రామం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పశ్చిమగోదావరి జిల్లాలో ప్రముఖ స్వాతంత్ర్య పోరాట యోధుడు, పార్లమెంటు సభ్యుడు, రైతు నేత, తొలితరం కమ్యూనిస్టు నాయకుడు ఉద్దరాజు రామంకు సిపిఎం తరఫున ఘనంగా నివాళులర్పించారు. స్థానిక పవర్‌పేటలో ఉన్న సిపిఎం జిల్లా కార్యాలయం (ఉద్దరాజు రామం భవనం)లో ఉద్దరాజు రామం 30వ వర్ధంతి కార్యక్రమం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత రామం చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు పూలమాల వేసి, మిగిలిన సభ్యులు పూలు ఉంచి ఘనంగా నివాళులర్పించి జోహార్లు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఉద్దరాజు రామం 1911 అక్టోబర్‌లో నరసాపురం తాలూకా వాలమర్రులో పెద పద్మరాజు, బంగారమ్మ దంపతులకు జన్మించారని, 1930 ఏప్రిల్‌లో రామంకు మాణిక్యాంబతో వివాహం జరిగిందని తెలిపారు. రాయకుదురులో ఉపాధ్యాయుడు బండారు కృష్ణమూర్తి దేశభక్తి ప్రబోధం రామంపై చెరగని ముద్రవేసిందని, వివాహమైన మూడో రోజునే నరసాపురం వద్ద ఉన్న మూలపర్రులో జరుగుతున్న ఉప్పు సత్యాగ్రహం ఉద్యమంలో చేరారన్నారు. స్వాతంత్రోద్యమంలో జైలు జీవితం గడిపారన్నారు. మొదట్లో కాంగ్రెస్ పార్టీని అభిమానించినా ఆ తర్వాత జాన్ రీడ్ రచించిన "ప్రపంచాన్ని కుదిపివేసిన ఆ పది రోజులు" అనే గ్రంథాన్ని చదివి కమ్యూనిజం సాధించిన విషయాలు తెలుసుకొని కమ్యూనిజం వైపు ఆకర్షితులయ్యారన్నారు. అప్పుడు ఎత్తిన కమ్యూనిస్టు జెండాను తుదిశ్వాస విడిచే వరకు విడవలేదని అన్నారు. జిల్లాలో సిపిఎం పార్టీ విస్తరణకు ఆయన చేసిన కృషి గొప్పదని కొనియాడారు. సిపిఎంలో మహిళా సంఘాన్ని నిర్మించడంలో, జిల్లాలో మహిళా ఉద్యమాలు సాగించడంలో మాణిక్యాంబ పాత్ర గొప్పదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ సిపిఎం పార్టీని జిల్లాలో నిర్మించడంతో పాటు, బలపేతం చేయడంలో ఆయన కృషి గొప్పదన్నారు. ఏలూరులోని సిపిఎం జిల్లా కార్యాలయానికి ఉద్దరాజు రామం భవనంగా నామకరణ చేసుకున్నామన్న విషయాన్ని గుర్తు చేశారు. అప్పటి ఉమ్మడి జిల్లాలో రైతు, కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగించారన్నారు. 1994 నవంబర్ 27న ఆయన మరణించారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఉద్దరాజు రామం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ఘనంగా ఎన్‌సిసి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - భీమడోలు

దేశ సమగ్రాభివృద్ధికి అందరూ ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రధాన ఆచార్యులు బొమ్ము రవికుమార్ కోరారు. ఎన్‌సిసి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కళాశాలకు చెందిన ఎన్‌సిసి క్యాడెట్లు, జాతీయ సేవా పథకం వాలంటీర్ల భాగస్వామ్యంతో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రధాన అధ్యాపకులు రవికుమార్ ప్రారంభించగా ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ భీమడోలు పురవీధుల్లో రెండు కిలోమీటర్ల పొడవున కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు దేశ ఐక్యత ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రాంతీయ, భాష, మత భేదాలకు అతీతంగా అందరూ ఐక్యంగా ఉన్నప్పుడు అభివృద్ధిని సాధించగలమని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి విభాగానికి చెందిన కెప్టెన్ శివశంకర్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు శశికాంత్, నాగరాజు, అధ్యాపకులు భవానిసింగ్, మాధవి పాల్గొన్నారు.

పేద జర్నలిస్టులకు ఉచితంగా ఇంటి స్థలం

దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

సమాజ సేవ కోసం శ్రమించే జర్నలిస్టుల సేవలు అభినందనీయమని, పేద జర్నలిస్టులకు మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని ఉచితంగా అందించే కూటమి ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా నిలుస్తుందని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఏలూరులోని గవరవరంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆధ్వర్యంలో జరిగిన జర్నలిస్టుల కార్తీక వన సమారాధన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎపియుడబ్ల్యుజె జర్నలిస్టుల అసోసియేషన్ నాయకులు ఎంఎల్‌ఎను సత్కరించారు.

సత్యనారాయణకు వేదవ్యాస్ పరామర్శ

ప్రజాశక్తి - ముదినేపల్లి

సత్యనారాయణను పరామర్శిస్తున్న వేదవ్యాస్

ముదినేపల్లి స్వామ్ ఐటిఐ ప్రిన్సిపల్ కూనపరెడ్డి సత్యనారాయణ మాతృమూర్తి వెంకమ్మ ఇటీవల స్వగ్రామమైన కృష్ణా జిల్లా పెదన మండలం చెన్నూరులో అనారోగ్యంతో మరణించారు. మాతృమూర్తిని కోల్పోయిన కూనపరెడ్డి సత్యనారాయణను బుధవారం ఎపి అసెంబ్లీ అంచనాల కమిటీ మాజీ ఛైర్మన్ బూరగడ్డ వేదవ్యాస్ ముదినేపల్లిలో ఆయన స్వగృహంలో కలిసి పరామర్శించారు.

మామిడి రైతులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - చాట్రాయి

మామిడి సాగు చేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని కె.ధారాణి అన్నారు. మండలంలోని చీపురుగూడెం, కోటపాడు గ్రామాల్లో మామిడి రైతుల అవగాహనా సదస్సు ఉద్యాన శాఖ చాట్రాయి మండల అధికారిణి ఆర్.హేమ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మామిడి పరిశోధన స్థానం నుంచి కె.ధారాణి పాల్గొని మాట్లాడుతూ మామిడి పూత నిలవాలన్నా, కాపు రావాలన్నా రైతులు పొటాషియం నైట్రేట్, బోరాన్ పిచికారీ చేయాలన్నారు. ఆర్.హేమ మాట్లాడుతూ రైతులు మామిడి కవర్లు హెక్టారుకు రూ.పది వేల వరకు తీసుకోవచ్చున్నారు. రైతులకు ఇన్సూరెన్స్ ఉందని రైతు రూ.2,250 కడితే రూ.45 వేల వరకు ఇన్సూరెన్స్ వస్తుందని రైతులందరూ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సౌండ్ బాక్స్ సెట్ బహూకరణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సాంస్కృతిక కార్యక్రమాలకు, మీటింగ్‌లకు ఉపయోగపడే సౌండ్ బాక్స్ సెట్‌ను అందించారు. ఎస్ఐ వై.రామ్మోహన్, టీచర్ ఎన్.రాంబాబు, కొంతమంది టీచర్స్, రిటైర్డ్ టీచర్స్ కలిసి రూ.15 వేల విలువైన సౌండ్ బాక్స్‌ను జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబుకు బుధవారం అందించారు. అనంతరం శేఖర్ బాబు దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, సందీప్ కుమార్, అసిస్టెంట్ లైబ్రేరియన్, జిల్లా గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'కార్యకర్తల సంక్షేమానికి టిడిపి కృషి'

ప్రజాశక్తి - టి.నరసాపురం

తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి పార్టీ నిరంతరం పని చేస్తుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని బండివారిగూడెంలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ సభ్యులు నాళం కాశీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. రూ.వంద కడితే రెండేళ్లకు సభ్యత్వం తీసుకున్న వారికి ఇన్సూరెన్స్‌తో పాటు రూ.ఐదు లక్షల ప్రమాద బీమాతో వర్తిస్తుందని, నిరుపేద పిల్లలకు యన్టీఆర్ ట్రస్ట్ ద్వారా విద్యను అందిస్తారని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

నూజివీడులో భారీ చోరీ

25 కాసుల బంగారు ఆభరణాలు అపహరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ పరిధిలోని ఎంప్లాయీస్ కాలనీలో గల విద్యుత్ శాఖ ఎడిఇ ఓలేటి దుర్గారావు నివాసంలో మంగళవారం రాత్రి భారీ చోరీ జరిగింది. బీరువాలోని 25 కాసుల బంగారు నగలు అపహరణకు గురయ్యాయి. ఓలేటి దుర్గారావు విధి నిర్వహణలో ఉండగా కుటుంబ సభ్యులు ఇంటి పనిలో ఉండగా తీసి ఉన్న తలుపును ఆసరా చేసుకుని లోపలికి ప్రవేశించిన ఆగాంతకుడు తాళం బీరువాకే ఉండడం గమనించి తలుపు తెరచి బీరువాలోని 25 కాసుల బంగారు నగలను చోరీ చేశాడు. ఇంటి బయట ఉన్న సాక్సులను కాళ్లకు వేసుకుని, పక్కనే ఉన్న ఇంటి ఆవరణలో ఉన్న దండెంపై ఉన్న తువ్వాలును చేతులకు చుట్టుకొని చేతి వేలిముద్రలు, కాలి ముద్రలు పడకుండా జాగ్రత్త పడినట్లు బాధితులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుని ఆచూకీ కోసం వేలి ముద్రలు, కాలి ముద్రలను సేకరించారు. డాగ్ స్క్వాడ్‌ను తీసుకురాగా బైపాస్ రోడ్డు వరకు పరుగులు తీసిన కుక్కలు మళ్లీ వెనుతిరిగాయి. ఈ సంఘటనకు సంబంధించి పట్టణ సిఐ పి.సత్యశ్రీనివాస్ కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీ పుటేజలను పరిశీలించి, ఆగాంతకుని ఆచూకీ కోసం ప్రత్యేక టీమ్‌లను సిద్ధం చేసినట్లు పోలీసులు తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడి

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల పరిధిలోని సీతారామ నగరం గ్రామ శివారులో కిన్నెరసాని నది ఒడ్డున నాటు స్థావరాలపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో సుమారు 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల నాటుసారా, సారా కాయటానికి ఉపయోగించే అల్యూమినియం సామగ్రిని, ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ రమేష్‌బాబు తెలిపారు.

ఆరు మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని గుళ్లపూడి గ్రామంలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో బెల్టుషాపు నిర్వహిస్తున్న పల్లి లక్ష్మీసుశీల వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. ఈ దాడుల్లో నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్ఐ వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్, హెడ్ కానిస్టేబుళ్లు కె.వెంకటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.వీరయ్య సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

టి.నరసాపురం : అగ్ని ప్రమాదంలో రేకుల ఇల్లు దగ్ధమై సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించింది. ఈ ఘటన మండలంలోని తెడ్లం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాగితాల వెంకటేశ్వరమ్మ వ్యక్తిగత పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి వేరే గ్రామం వెళ్లింది. ఈ క్రమంలో ఇంట్లో నుంచి మంటలు రావడం చూసిన స్థానికులు మంటలు అదుపుచేసే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే ఇంట్లో విలువైన సుమారు రూ.లక్ష విలువైన సామగ్రి, టివి, ఫ్రిజ్ ఇతర గృహోపకరణాలు దగ్ధమయ్యారని, విద్యుత్ ప్రమాదం వల్లే మంటలు వ్యాపించాయని వారు తెలిపారు. ఇంటిని విఆర్ఒ ఆంజనేయులు పరిశీలించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

తాగునీటి సమస్య పరిష్కరించరూ...!

కుమ్మరిరేవు ప్రాంతవాసుల వేడుకోలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరంలోని 29వ డివిజన్ కుమ్మరిరేవు ప్రాంతంలో ఏటుగట్టుకు ఆనుకుని శ్మశానాల వైపు దాదాపుగా 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. గత పది రోజులుగా తాగునీరు రావడం లేదని వారు ఆందోళన చెందుతున్నారు. గత పదేళ్లుగా నీటి సమస్య ఉందని, ఎంతమంది అధికారులను కలిసి తమ గోడు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. గత పదేళ్ల నుంచి కుళాయి నీరు వచ్చే సమయానికి మోటర్లు ఆన్‌చేస్తే నీరు వచ్చేవని, కొన్నిసార్లు అలా కూడా రాని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. వారి సమస్యను ప్రభుత్వ అధికారులకు తెలియజేసినప్పుడు కొన్ని రోజులు ట్యాంకర్లను పంపి నీరు పంపించేవారని, కొన్ని రోజుల తర్వాత అవి కూడా ఆగిపోయావని తెలిపారు. గతంలో ఎన్నికల ముందు పని చేసిన కమిషనర్ ఏటిగట్టు మీద బోర్వెల్ వేయడానికి నిధులు శాంక్షన్ అయ్యాయని తెలిపారని అంటున్నారు. కాని ఇప్పటివరకు బోర్వెల్ వేయడానికి ఏ అధికారి ఇటువైపు చూడలేదని వాపోతున్నారు. అదేవిధంగా వీధిలైట్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలుపుతున్నారు. ఈ ప్రాంతం చీకటిగా ఉండడంతో పాములు, తేళ్లు సైతం ఇళ్లల్లోకి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వారి నీటి సమస్యను, వీధి లైట్ సమస్యను అధికారులు పట్టించుకోని త్వరగా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

పదేళ్ల నుంచి తాగునీటి సమస్య

చిట్టా దుర్గారావు



గత పదేళ్ల నుంచి మాకు నీటి సమస్య ఉంది. మామూలు కాలాల్లోనే నీరు సరిగ్గా రాదు. అదే ఎండాకాలం వస్తే బిందెలు పట్టుకొని లంకపేట నుంచి నీరు తెచ్చుకోవాల్సి వస్తుంది. గతంలో బిందెలు పట్టుకొని కమిషనర్ కార్యాలయానికి వెళ్తే ట్యాంకర్లు పంపించారు. కాని శాశ్వత పరిష్కారం చూపలేదు.

శాశ్వత పరిష్కారం చూపాలి

చిట్టా కళావతి

ఇక్కడ దాదాపుగా 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇక్కడ అందరూ మోటార్లు వేసుకుంటున్నారు. మోటార్ వేసిన గాలి వస్తుంది కాని నీరు రావట్లేదు. పక్కనే శ్మశాన వాటిక ఉంది. వీధిలైట్లు లేక చీకట్లో చాలామంది ప్రమాదాలకు గురయ్యారు. పార్టీ నాయకులు, కమిషనర్ మా గోడు విని మాకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నాం.

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం

రాణి

ఇక్కడ నీటి సమస్యతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. వీధిలైట్లు లేకపోవడంతో పాములు, తేళ్లు ఇళ్లల్లోకి వస్తున్నాయి. నీటి కోసం ఎక్కడికి వెళ్లాలో కూడా తెలియట్లేదు. కనీసం బోరు సదుపాయం కూడా లేదు. ఎన్నికల ముందు మే నెలలో కమిషనర్ వచ్చి ఏటిగట్టు మీద బోరు మంజూరైందని చెప్పారు. కాని ఇప్పటివరకు బోర్ వేయలేదు. పిల్లలతోటి, ముసలివాళ్లతో చాలా ఇబ్బంది పడుతున్నాం. దయచేసి మా సమస్యకు పరిష్కారం చూపండి.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఉంగుటూరు

గొల్లగూడెం ఆంజనేయ స్వామి ఆలయ వీధిలో చేతికందేలా ప్రమాద కరంగా విద్యుత్ తీగలు ఉండడంతో దీనిపై ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో గొల్లగూడెం విద్యుత్ ఉపకేంద్రం ఎఇ టి.వేణు స్పందించి గురువారం కొత్తగా పోల్ పాతించి తీగలు కిందకు వేలాడకుండా చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న విద్యుత్ అధికారులకు బాధితులు నక్కా సుబ్బారావు, నక్కా మదన్ మోహన్ కృతజ్ఞతలు తెలిపారు.

వంట ఏజెన్సీని రద్దు చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని జెడ్‌పి బాలికల హైస్కూల్‌లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అస్తవ్యస్తంగా కొనసాగుతోందని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్ పర్సన్ నేరుసు నాగులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో ఆయన బుధవారం మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారం బయట వ్యక్తులకు అవసరమైన పిండి వంటలను చేస్తూ అందులో మిగిలిన వంట నూనెతో చిన్నారి విద్యార్థులకు ఆహారాన్ని వండుతున్నట్లు ఆరోపించారు. మధ్యాహ్న భోజన అటెండెన్స్‌లో చూపుతున్న సంఖ్యకు, భోజనం చేసిన విద్యార్థుల సంఖ్యకు పొంతన లేదన్నారు. ఈ విషయంలో జిల్లా విద్యాశాఖాధికారి, కలెక్టర్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తక్షణమే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో కొనసాగుతున్న ఇక్కడ ఏజెన్సీని రద్దుచేసి నాణ్యమైన ఆహారాన్ని ప్రభుత్వ లక్ష్యం మేరకు అందించగలిగిన మరో కొత్త ఏజెన్సీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఆశ్రంలో కిడ్నీ మార్పిడి వైద్య సేవలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జాతీయ అవయవదాన అవగాహనా దినోత్సవం సందర్భంగా ఆశ్రమం హాస్పిటల్స్, విష్టార్ హాస్పిటల్స్ వారు సంయుక్తంగా ఉభయ గోదావరి కృష్ణా జిల్లాల ప్రజల సౌకర్యార్థం కిడ్నీ మార్పిడి వైద్య సేవలను ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో ప్రారంభించినట్లు సిఇఒ హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నూతన భాగస్వామ్యం ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలు, నూతన సాంకేతికతను వినియోగించి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జీవందాన్ పర్యవేక్షణలో ఈ కిడ్నీ మార్పిడి వైద్య సేవలను అందించనున్నట్లు తెలిపారు. సుమారుగా 500కు పైగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లను నిర్వహించిన డాక్టర్ వెంకట చైతన్య సింగంశెట్టి వారి నేతృత్వంలో ఈ కిడ్నీ మార్పిడి సేవలను అందించనున్నట్లు తెలిపారు.

ఆరోగ్య సూత్రాలపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అన్ని కాలాల్లో జ్వరాలు ఉంటాయని, ఎక్కడపడితే అక్కడ నీరు నిల్వ ఉండడం ద్వారా దోమలు వృద్ధి చెంది దోమకాటు ద్వారా జ్వరాలు పెరిగే అవకాశం ఎక్కువగా ఉందని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు తెలిపారు. స్థానిక మోతేవారితోట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎరుకల కాలనీ ప్రాంతంలో బుధవారం ప్రజలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ దోమలు ఎక్కువగా వృద్ధి చెందడానికి నీరు ఎక్కువగా నిల్వ ఉండడమే కారణమని, ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని డ్రై డే ఆచరించాలని ప్రజలకు సూచించారు. దోమల పట్ల అప్రమత్తంగా ఉండి దోమలు పెరిగే స్థలాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్లల్లో అవసరం లేని వస్తువులను బయట పారవేయాలని, ఇంటి బయట లోపల శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా గోనెసంచులు ఇవ్వాలి

ప్రజాశక్తి - చింతలపూడి



సిబ్బందితో మాట్లాడుతున్న హబీబ్ బాషా

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందుల్లేకుండా గోనెసంచులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ బాషా, ఏలూరు సివిల్ సప్లై డిఎం శ్రీలక్ష్మి తెలిపారు. చింతలపూడి మండలంలో ఆర్‌బికె-1ను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గోనెసంచల కొరత కూడా లేదని, రైతులకు ఎందుకు ఇవ్వడం లేదని, రెండు రోజుల తర్వాత రమ్మని ఎందుకు చెబుతున్నారని, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే రకంగా పనిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోనెసంచుల కొరత ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

బాల్యవివాహాలతో అనర్థాలే

ప్రజాశక్తి - మండవల్లి

బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుని బాల్యవివాహాలను అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వివిఎన్‌వి.లక్ష్మి అన్నారు. ఎపి స్టేట్ లీగల్ సర్వీసెస్ ఆదేశాల మేరకు స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. మండవల్లిని బాల్య వివాహాల రహిత మండలంగా తీర్చిదిద్దడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్ డి.శివప్రసాద్, సూపర్‌వైజర్ లక్ష్మీప్రసన్న, హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణంరాజు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, డ్వాక్రా మహిళలు, మండల లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు పిఎల్‌విలు పాల్గొన్నారు.

పాఠశాలలో 'రాష్ట్రీయ బాల సురక్ష'

ప్రజాశక్తి - భీమడోలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం తొలిసారిగా మూడు నెలలకు ఒకసారి నిర్వహించే పేరెంట్, టీచర్ సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు డిసెంబర్ ఏడో తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలకు చెందిన విద్యార్థులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీనిలో భాగంగా నియోజకవర్గానికి ఐదు పాఠశాలల వంతున ఎంపిక చేశారు. ఈ క్రమంలో భీమడోలు మండలం నుంచి పూళ్ల, గుండుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. దీనిలో విద్యార్థుల ఆరోగ్య సమస్యలు, విద్యాబోధన ఇతర అంశాల గురించి ముఖ్యమంత్రి విద్యార్థులతో నేరుగా చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం గుండుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శ్రీలక్ష్మి నిర్వహించారు. శిబిరాన్ని విద్యాధికారి భాస్కర్‌కుమార్ సందర్శించి శిబిరం కొనసాగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతి గురువారం రక్తహీనత నివారణకు ఐరన్ టాబ్లెట్లను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పాడి పశువులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - మండవల్లి

పశువులకు సంక్రమించే వ్యాధులను సకాలంలో నివారించుకుంటే పాడి పెంపకం ఆశాజనకంగా ఉంటుందని పశు గణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెరికిగూడెంలో పశు గణాభివృద్ధి సంస్థ గన్నవరం వారి సౌజన్యంతో పశువులకు నిర్వహించిన గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పశువులను పరిశీలించారు. ఈ సందర్భంగా పశువులకు వ్యాధులు సంక్రమించకుండా జాగ్రత్త పడాలన్నారు. వ్యాధి సంక్రమించిందని గమనిస్తే వెంటనే వైద్య శిబిరానికి తరలించి చికిత్స అందించాలన్నారు. ఈ శిబిరంలో ఎదకు రాని 21 పశువులకు హార్మోన్ల చికిత్స గర్భవాతం కలిగిన 18 పశువులకు యాంటీబయాటిక్ చికిత్సతో పాటు సూడి నిలవని పశువులకు తగిన చికిత్స చేసినట్లు చెప్పారు. అంతేకాకుండా 16 పశువులకు జలగ వ్యాధి నివారణకు పది లేగ దూడలకు ఏలిక పాముల నివారణకు మందులను తాగించామన్నారు. మందగుది కలిగిన నాలుగు పశువులకు ఆపరేషన్ నిర్వహించి పశు పోషకులకు తగు సూచనలు, సలహాలు అందించామన్నారు. అంతేకాకుండా పశువులకు అవసరమైన రూ.20 వేల ఖరీదు చేసే మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. అనంతరం ప్యాడి ప్రోక్యుర్‌మెంట్‌లో భాగంగా జాయింట్ కలెక్టర్ పశు వైద్య శిబిరాన్ని ఆకస్మిక సంఘానికి చేసి పాడి రైతులకు ఖనిజ లవణ మిశ్రమ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు గంగవరపు రామకృష్ణ, క్రాంతికుమార్, డివి.వరప్రసాద్ పాల్గొని వైద్య సేవలందించారు.

రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగింపు

ప్రజాశక్తి - ముసునూరు

తుక్కులూరు గ్రామం నుంచి ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బి రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి ప్రజలు ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి వెంటనే స్పందించి తన సొంత నిధులతో బుధవారం రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు ముసునూరు రాజా, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు వెంకటరెడ్డి, మండల నాయకులు బత్తుల మాధవరావు, గ్రామ నాయకులు గోగినేని రాము, కారుమంచి రాజు, ఆరేపల్లి రవి పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులెవరూ మరో మూడు రోజుల పాటు వరికోతలు కోయవద్దని ఆగిరిపల్లి మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు కోరారు. బుధవారం ఆయన వరి పంటపొలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ అప్రమత్తంగా ఉండటంతో పాటు ఇప్పటికే వరికోతలు కోసి పనల మీద ఉన్న వాటిని కుప్పలు వేయాలని, పంట నూర్చిన ధాన్యాన్ని రైతు కోనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించాలని, వరి పంట కోసిన రైతలు పొలంలోనే కుప్పలు వేసి వర్షపు నీరు చేరకుండా చుట్టూ కందకాలు తీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కె.ధనబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటలక్ష్మి, సతీష్ పాల్గొన్నారు.

భీమడోలు : తుపాను హెచ్చరికల నేపథ్యంలో రామన్న రెండు మూడు రోజుల్లో ధాన్యం తరలింపు విషయమై రైతులు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని భీమడోలు తహశీల్దార్ బి.రమాదేవి, వ్యవసాయ అధికారి ఉషారాణి కోరారు. బుధవారం వారు మండలంలో విస్తృతంగా పర్యటించారు. రైతులను కలిశారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఇదేవిధంగా రైతు సేకరణ ఏజెన్సీగా పనిచేస్తున్న పూళ్ల సొసైటీ పరిధిలో కొనసాగుతున్న ధాన్యం సేకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మండలంలో 6000 మెట్రిక్ టన్నుల ఆరబెట్టిన ధాన్యం రైతు సేవా కేంద్రాలకు చేరాల్సి ఉందన్నారు. 3500 విస్తీర్ణంలో వరి కోతలకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాల మేరకు రవాణాకు సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని మిల్లులోకి తరలించే విషయమై ఏజెన్సీలు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది రైతులను చైతన్య పరచాలని కోరారు. వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు.

ముదినేపల్లి : రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి బి.వేణుమాధవ్ కోరారు. ముదినేపల్లి రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి వేణుమాధవ్ మాట్లాడుతూ రానున్న రెండు, మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులందరూ వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇప్పటికే కోసి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని తమకు అందుబాటులో ఉన్న రైస్ మిల్లులకు, రైతు సేవ కేంద్రాల ద్వారా తోలుకోవాలని తెలిపారు. రానున్న రబీలో వేయబోయే మినుము పైరుకు రైతులందరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ఎకరానికి రూ.60 ప్రీమియంగా ప్రభుత్వం నిర్ణయించిందని, సాగు సర్టిఫికెట్ గ్రామ వ్యవసాయ సహాయకుల దగ్గర తీసుకుని మీ సేవాకేంద్రంలో ప్రీమియం చెల్లించి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలిపారు. రసం పీల్చే పురుగులను అరికట్టేందుకు విధిగా విత్తన శుద్ధి చేసుకోవాల్సిందిగా రైతులకు తెలిపారు.



ఆగిరిపల్లిలో...

పోలవరం : తుపాను ప్రభావం వల్ల వరి పండించే రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని తహశీల్దార్ బి.సాయిరాజు, వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబు రైతులకు సూచించారు. ఇప్పటికే రాశుల మీద ఉన్న ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల్లో తెలియజేసి తక్షణమే మిల్లులకు పంపించే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రాశుల మీద ఉన్న ధాన్యాలకు గోనెసంచులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మండలంలో 75 వేల గోనెసంచులు రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

జీలుగుమిల్లి : తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.గంగాధర్ తెలిపారు. మండలంలోని పి.అంకంపాలెం, తాటియాకులగూడెం రైతు సేవ కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పలు రకాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. తుపాన్ ప్రభావం పోయేవరకు చేతికి వచ్చిన వేరుశనగ, వరి కోతలు నిలుపుదల చేయాలని రైతులకు సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన

ప్రజాశక్తి - మండవల్లి

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి స్పష్టం చేశారు. ముదినేపల్లి, మండవల్లి మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె బుధవారం సందర్శించి ధాన్యం కొనుగోలు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపాను విషయంపై రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ఎవరూ ముందస్తు కోతలు, నూర్పుళ్లు చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

1న పలు పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

డిసెంబర్ ఒకటో తేదీ ఆదివారం రాజమండ్రిలోని సిపిఐ కార్యాలయంలో అభ్యుదయ జానపద, దేశభక్తి పాటలు, సాంఘిక చారిత్రాత్మక ఏకపాత్రభినయం పోటీలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్, ఏలూరు జిల్లా ప్రజానాట్యమండలి కన్వీనర్ బల్ల కనక దుర్గారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయస్సు గల యువత పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి నగదు, జ్ఞాపికలు బహుకరించబడతాయని తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు తీసుకువెళ్తామని తెలిపారు. జిల్లాలోని యువ కళాకారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

1 నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - ముసునూరు

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సులు జారీ చేసినట్లు తహశీల్దార్ కె.రాజకుమార్ అన్నారు. బుధవారం ఆయన విలేకరతో మాట్లాడుతూ గ్రామ, మండలస్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ఆయా సభల ద్వారా ఫిర్యాదులు స్వీకరించి, 45 రోజుల్లో ఆ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం, భూ ఆక్రమణలు, సరిహద్దు వివాదాలు, మ్యుటేషన్లు, రికార్డుల్లో మార్పులు వంటి సమస్యలకు రైతుల నుంచి అర్జీలను తీసుకుని పరిష్కరించనున్నట్లు తెలిపారు.

బహుజన సేన వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎస్‌సి ఎస్‌టి బిసి ముస్లిం మైనార్టీ కాపులందరూ కలిసి రానున్న రోజుల్లో బలమైన శక్తిగా ముందుకు వెళ్లాలని, ఆ ప్రయాణంలో తన సహకారం ఉంటుందని ఉద్యోగ సంఘ నాయకులు చోడగిరి శ్రీనివాసరావు తెలిపారు. బహుజన సేన ప్రథమ వార్షికోత్సవం కార్యక్రమాన్ని స్థానిక నవాబ్‌పేటలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ బహుజనసేన ఏర్పడిన గత సంవత్సర కాలంలో ఎన్నో సేవలు చేసిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బహుజన సేన వ్యవస్థాపక అధ్యక్షుడు మత్తయి బాబి, జనసేన నాయకుడు నారాశేషు, ఈడ మాజీ ఛైర్మన్ బొద్దాల శ్రీనివాస్, జనసేన దెందులూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొఠారు ఆదిశేషు, స్థానిక కార్పొరేటర్ బొద్దాని అఖిలప్రియ, బహుజన సేన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ది.23-11-2024వ తేదీన నా యొక్క పాస్‌పోర్టు నెం.టి 2653377 గల పాస్‌పోర్టును జిరాక్స్ తీయించుకొను నిమిత్తము ఆకివీడులో మా ఇంటి వద్ద నుండి ఆకివీడు సెంటరుకు వెళ్ళుచుండగా నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు ఎక్కడో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియ చేయవలసినదిగా యావన్మందిని కోరడమైనది.

రాపాక విమల, (భర్త) నరేష్,
ఆకివీడు, ఆకివీడు మండలం,
పశ్చిమ గోదావరి జిల్లా.
ఫోన్:9573948814.

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.84/2018

Between:

పంతం ధర్మారావు ...వాది

Vs

పంతం సత్యనారాయణ స్వామి వగైరా ...ప్రతివాద్లు

పై నెంబరు దావాలో ఎనిమిదవ ప్రతివాది శ్రీమతి పంతం నాగ జ్యోతి భర్త వడయవార్లు, తండ్రి పంతం సింహాద్రి డోర్.నెం.8-24-9, రామానుజకూటమి వీధి, 18వ వార్డు, తాళ్ళముదునూరుపాడు, తాడేపల్లిగూడెం అనువారు పై నెంబరు దావాలో కోర్టు ద్వారా ఎన్నిమార్లు దావా సమన్లు పంపినప్పటికీ తీసుకొనక evade చేయుచున్నందున శ్రీకోర్టు వారి ఉత్తర్వులు మేరకు యీ ప్రకటన ఇవ్వడమైనది. కావున సదరు ఎనిమిదవ ప్రతివాది శ్రీమతి పంతం నాగజ్యోతి భర్త వడయవార్లు, తండ్రి పంతం సింహాద్రి, డోర్‌నెం.8-24-9, రామానుజ కూటమి వీధి, తాళ్ళముదునూరుపాడు, తాడేపల్లిగూడెం ది.10-12-2024వ తేదీన ఉదయం గం.10.30 నిమిషములకు పైన తెలిపిన కోర్టులో స్వయంగా గాని అడ్వకేట్ ద్వారా గాని హాజరయి ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.

తాడేపల్లిగూడెం **ధూళిపాళ సూర్యరామారావు**
తేది.26-11-2024 వాది తరపు న్యాయవాది